మత్స్యయీ, అధ్యక్ష అభ్యర్థి బిల్ క్లింటన్‌ల విజయానికై ఎంతో కృషి చేశారు. అయితే అమెరికన్ రాజకీయాల్లో భారతీయులు పాల్గొనడం అనేది యిది మొదటిసారి కాదు. 1957లోనే దిలీప్‌సింగ్ అమెరికాలో ఆసియాకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధిగా వున్నాడు. ఈ పర్యాయం గనక భారతీయ అభ్యర్థులు విజయం సాధించిన పక్షంలో అమెరికా రాజకీయాల్లో భారత జాతీయులు కీలకమైన పాత్రను నిర్వహించే అవకాశం వుంటుంది. అంతేగాక తన స్వంత ప్రతినిధులను చట్ట సభలకు పంపించడం ద్వారా అమెరికా ఎదుర్కొంటున్న వర్ణ వివక్షా సంబంధమైన సమస్యల్ని అక్కడి భారతీయులు సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. ఈ అభ్యర్థులు గనక విజయం సాధిస్తే భారత-అమెరికా సంబంధాలు చాలా వరకు మెరుగుపడే అవకాశం కూడా వుంటుంది. అమెరికాలోని యూదు జాతీయులు చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించడం ద్వారా ఇజ్రాయేలు ప్రయోజనాలను పరిరక్షించుకుంటున్నట్టే భారతీయులు కూడా తమ దేశ ప్రయోజనాలు కోసం పాటుపడే అవకాశం ఏర్పడుతుంది.

(ద వీక్ సౌజన్యంతో)




వారం వారం

వాల్మీకం

త్వరలో కొత్త శీర్షిక

ప్రారంభం!


# నిజాయితీ! నీ చిరునామా చెప్పవూ...




ప్రభుత్వోద్యోగుల మీద చాలా రకాల జోక్సు, నిందలు వున్నాయి. ఆఫీసు ఫైల్స్‌మధ్య మేగజైన్స్ చదువుతారని నింద. లంచగొండితనం మీద నిందలున్నా అవి మనం పట్టించుకోనక్కరలేదు. లంచగొండితనం కూడా ఒక జీవిత భాగస్వామే కనుక! ఒక ప్రభుత్వోద్యోగికి తన భార్య ఒక జీవిత భాగస్వామి అయితే, లంచగొండితనం ఇంకో జీవిత భాగస్వామి. అంటే ఓ పక్క భార్య, ఓ పక్క లంచగొండితనం వుంటే ఇహ తమ లేనట్టే! అందుకే మనిషి ఎవ్వడూ పరిపూర్ణుడు కాడనడానికి ఇదో నిదర్శనం!

ఇహ జోక్సు విషయమంటారా? ఒక ప్రభుత్వోద్యోగి జ్వరంగా వుందని ఆఫీసుకి రెండ్రోజులు సెలవు పెట్టినవాడు, ఆ సెలవు కేన్సిల్ చేసేసుకుని ఆఫీసుకొచ్చేశాడు. సెలవు పెట్టినవాడివి ఆఫీసు కెందుకొచ్చావయ్యా అంటే డాక్టర్‌గారు రెస్టు తీసుకోమన్నారు" అన్నాట్ట!

కాని, నా బాల్య మిత్రుడు వైశంపాయనం విషయంలో ఇవేవీ నిజం కావు. వాడు గురుతరమైన బాధ్యతలు మోస్తున్న వేలమీద లెక్కపెట్టతగ్గ-కాదు, వేళ్ళమీద లెక్కపెట్టతగ్గ కొద్దిమంది ప్రభుత్వోద్యోగులలో ఒకడు! అటువంటి వాళ్ళు కొద్దిమందైనా వుండబట్టే ఇంకా మనం 'కలియుగే ప్రథమ పాదే' అంటున్నాము. లేకపోతే 'కలియుగే అంత్యపాదే' అనేవాళ్ళమే!

వైశంపాయనం ఒక ప్రభుత్వ శాఖలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టరుగా వుంటున్నాడు. మా అమ్మాయి పెళ్ళికి వాడు స్వయంగా వచ్చి మా అమ్మాయినీ అల్లుణ్ణీ ఆశీర్వదించాలని నా ఆకాంక్ష. కాని, వాడు మోస్తున్న గురుతర బాధ్యతలవల్ల రాలేడేమోనని బెంగ! వాడికి సెలవు దొరకడమే కష్టం. ఐనా ఇరవై రోజులు ముందుగా మా అమ్మాయి పెళ్ళి శుభలేఖ పంపేను. ఒకవేళ సెలవు సేంక్షన్ చేయించుకోవాలన్నా, ట్రెయిన్‌లో బెర్తు రిజర్వు చేసుకోవాలన్నా, ఆమాత్రం వ్యవధి అవసరం.,

దేవుడు నిజంగానే వున్నాడు. నిజంలోనే దేవుడున్నాడు! వైశంపాయనం మా అమ్మాయి పెళ్ళికి వచ్చాడు. వధూవరుల్ని ఆశీర్వదించాడు. తనకు తోచిన గిఫ్టేదో ఇచ్చాడు. అందరితోపాటే విందు భోజనం ఆరగించాడు. నాకెంతో కనువిందు చేశాడు.

"నువ్వు రాలేవనుకున్నానురా! ఎలాగో వీలు కల్పించుకుని వచ్చావు. మా అమ్మాయినీ అల్లుణ్ణీ ఆశీర్వదించావు. అదే పదివేలు" అని నా హర్షం వెలిబుచ్చాను.

"నేనిక్కడికి రావడానికి అఫీషియల్ విజిట్ కూడా కల్పించుకున్నాను. నీ శుభలేఖ అందిన నాల్రోజులకి, ఈ వూళ్ళో ఓ ప్రభుత్వోద్యోగి ఏవో దొంగ టియ్యే బిల్స్ పెట్టేడని ఓ ఆకాశ రామన్న ఉత్తరం వచ్చింది. ఎన్క్వయిరీకని బయలుదేరి, ఇలా మీ అమ్మాయి పెళ్ళిక్కూడా వచ్చాను" అన్నాడు.

"మా అమ్మాయి పెళ్ళి శుభలేఖ అందడం- ఆకాశ రామన్న ఉత్తరం అందడం-కేవలం కాకతాళీయమన్న మాట!" అన్నాను.

"కాకతాళీయమా పాడా? ఆ ఆకాశరామన్న ఉత్తరం రాసింది నేనే!" అన్నాడు వైశంపాయనం.

— బులుసు-జీ-ప్రకాష్